లక్ష్మర్ జిల్లా ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గుర్రం పవన్‌కుమార్ గౌడ్

సికింద్రాబాద్/ బేగంపేట్ మార్చి 6: ప్రత్యేక లక్ష్మర్(సికింద్రాబాద్ జిల్లా) కోరుతూ లక్ష్మర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. లక్ష్మర్ జిల్లా ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి సాధం బాలరాజ్‌యాదవ్, శైలెందర్, సునిల్ ముదిరాజ్, జగదీశ్‌గౌడ్, అజీజ్, అశోక్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులతో సమావేశం

అధ్యాపకులతో సమావేశమైన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ అర్జున్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 6: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అర్జున్ రావు కళాశాల అధ్యాపకులతో బుధవారం తొలిసారిగా సమావేశమయ్యారు. కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాకులతో సమావేశమైన ఆయన సమయపాలన, టీచింగ్, రీసర్చ్ తన ప్రథమ ప్రాధాన్యాలని వివరించారు. రాబోయే పరీక్షల సమయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అనుపమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్‌పై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఉచితంగా చేసే వరకు బీఆర్ఎస్ ఆందోళన
- హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట ధర్నాలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



హెచ్ఎండీఏ అధికారులకు వినతిప్రతం అందజేస్తున్న తలసాని సాయికిరణ్‌యాదవ్

అమీర్‌పేట్, మార్చి 6 : అమలు సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తరువాత ఆహామీలను తుంగలో తొక్కడాన్ని బీఆర్ఎస్ ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించబోదని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎల్ఆర్ఎస్ విషయంలో మారిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పిలుపు మేరకు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఇబ్బందులు కలగొద్దనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ జోలికి వెళ్లలేదన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తన ఉచిత హామీల్లో భాగంగా ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు ఉచితంగా చేస్తామని చెప్పడంతోపాటు అనేక అమలు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసగిస్తుందన్నారు. ఎల్ఆర్ఎస్ విషయంలో 25 లక్షల కుటుంబాలపై దాదాపు రూ. 20 వేల కోట్ల మేర భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదన్నారు. కాంగ్రెస్ నాయకులు పదవులు పొందిన తరువాత ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌ను ఉచితం చేసేంత వరకు బీఆర్ఎస్ పార్టీ ఆందోళన కొనసాగిస్తుందని హెచ్చరించారు.

హెచ్ఎండీఏ అధికారులకు వినతిపత్రం

ఈ విషయమై ధర్నా అనంతరం సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు హెచ్ఎండీఏ అధికారులకు వినతిప్రతం అందజేశారు. ధర్నాలో బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, ఆకుల రూప, పార్టీ అమీర్‌పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలి

బీఆర్ఎస్ మహాధర్నాలో సికింద్రాబాద్ కార్పొరేటర్లు



అడ్డగుట్ట నుంచి మహాధర్నాకు తరలివెళుతున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు

మహాధర్నాలో పాల్గొన్న సికింద్రాబాద్ కార్పొరేటర్లు, నాయకులు

సికింద్రాబాద్, మార్చి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగానే ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని సికింద్రాబాద్ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు బుధవారం అమీర్‌పేటలోని మైత్రివనం హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పినట్టుగానే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. సీతాఫల్‌మండి, అడ్డగుట్ట కార్పొరేటర్లు హేమ, ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్ నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ఎండగట్టారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, డీ.శ్రీనివాస్, ఎల్లయ్య, మహ్మద్ శ్రీరాములు, నర్సింగ్, గణేశ్, రవి, యాదగిరి పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మకు పూజలు

కంటోన్మెంట్ ఏడో వార్డు లాల్‌బజార్ చిన్న కమేళా బస్తీలో ఏర్పాటు చేసిన కల్లుగుడాల్ రేణుకాఎల్లమ్మను బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్, తదితరులు దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

– బొల్లారం, మార్చి 6

కామర్స్‌లో నూతన పోకడలను విద్యార్థులకు వివరించాలి

ప్రొఫెసర్ రెడ్యానాయక్‌ను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 6: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం వార్షిక సదస్సును బుధవారం ఘనంగా నిర్వహించారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు మాట్లాడుతూ కామర్స్ విద్యలో నూతన పోకడలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. వాటిని అధ్యాపకులు ఎప్పటికప్పుడు తెలుసుకుని, విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. కామర్స్ విద్య ప్రస్తుత అవసరాలు, దాని ప్రాముఖ్యతను చర్చించారు. కామర్స్ హెడ్ ప్రొఫెసర్ డి. చెన్నప్ప పాఠ్య ప్రణాళికను, గతేడాది చేపట్టిన విద్యాపరమైన కార్యక్రమాలను వివరించారు. ఎంకాం కంప్యూటర్ అప్లికేషన్స్, ఎంకామ్ బిజినెస్ అనాలిటిక్స్, బీకాం బిజినెస్ స్టడీస్ కోర్సులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంకామ్ ఫలితాలపై చర్చించారు. యూనివర్సిటీ పరీక్షలు, మూల్యాంకన విధానాలపై సమీక్షించారు. 521 పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వివిధ వాణిజ్య సంస్థలతో సంప్రదిస్తున్నట్లు వివరించారు. సదస్సులో ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనగేశ్, డీన్ ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ అప్పారావు, ప్రొఫెసర్ సీవీ రంజని, ప్రొఫెసర్ శేఖర్, ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి



మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆహ్వానపత్రిక, ప్రసాదం అందజేస్తున్న ఆలయ చైర్మన్ సి. సంతోష్‌యాదవ్, తదితరులు

మారేడ్‌పల్లి, మార్చి 6 : మారేడ్‌పల్లిలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ సి. సంతోష్‌యాదవ్, సభ్యులు చొల్లేటి రమేశ్ తెలిపారు. ఈ నెల 7న ఉదయం రుద్ర హోమం, సాయంత్రం శివ కల్యాణం, 8న మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సంతత ధారా అభిషేకం, అర్చనలు, రాత్రి 10:30 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకము ఉంటాయని వెల్లడించారు. ఉత్సవాలకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ ఇన్‌చార్జి వెన్నెలతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

మహంకాళి డివిజన్ ఏసీపీగా సర్దార్‌సింగ్

ఏసీపీ రవిందర్‌యాదవ్‌ను సత్కరించి వీడ్కోలు తెలుపుతున్న నూతన ఏసీపీ సర్దార్‌సింగ్, పోలీస్ సిబ్బంది

బేగంపేట్ మార్చి 6 : సికింద్రాబాద్ ఉత్తర మండలం మహంకాళి డివిజన్ ఏసీపీగా సర్దార్ సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సర్దార్‌సింగ్ గతంలో నిజామాబాద్, నల్లగొండ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో సీఐడీ డీఎస్‌పీగా విధులు నిర్వహించారు. ఇక్కడ ఏసీపీగా పని చేసిన రవిందర్ యాదవ్ పోలీస్ అకాడమీకి బదిలీ అయ్యారు. బుధవారం మహంకాళి ఏసీపీ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న రవిందర్ యాదవ్‌ను సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నూతన ఏసీపీ సర్ధార్‌సింగ్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తనవంతు బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అమీర్‌పేట్, మార్చి 6 : సనత్‌నగర్ జెక్‌కాలనీలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కమిటీ ప్రముఖులు కుర్రా కృష్ణకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు కాలనీకి చెందిన ఎస్. అన్నపూర్ణ(దేవాదాయ శాఖ సహాయ కమిషనర్), చింతిరెడ్డి ప్రభ, కృష్ణకుమారి, భాగ్య, అమరావతి తదితరులు సహకారం అందించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన అయిదుగురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన మహిళలకు బహుమతులను అందజేశారు. అనంతరం మహిళలంతా కలిసి చేసిన సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

అగ్నిమాపక పరికరాల వినియోగంపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమీర్‌పేట్, మార్చి 6 : అగ్నిప్రమాదాల నియంత్రణపై సనత్‌నగర్ అగ్నిమాపక అధికారి ప్రదీప్ ఆధ్వర్యంలో బుధవారం అమీర్‌పేట్‌లోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కల్పించారు. ఆసుపత్రి ఇన్‌చార్జి ఆర్ఎంవో రవూఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన శిబిరంలో వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అందుబాటులో ఉన్న అగ్నిమాపక పరికరాల ద్వారా మంటలను ఎలా? ఆర్పవచ్చనే అంశంపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కావలసినంత నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆపత్కాలంలో అందుబాటులో ఉండే అగ్నిమాపక పరికరాలను వినియోగించడం ప్రతిఒక్కరూ తెలుసుకోవడం మంచిదని సనత్‌నగర్ ఎస్ఎఫ్‌వో ప్రదీప్ పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమైన ఈఆర్ఓ, డీసీ సుభాశ్‌రావు

సికింద్రాబాద్, మార్చి 6: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ సూచించారు. బుధవారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, డీసీ సికింద్రాబాద్ సుభాశ్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో 1500 మించి ఓటర్లు ఉండకుండా సమీప పోలింగ్ బూత్‌ల్లోకి మార్చనున్నట్లు తెలిపారు. ఈవీఎంలతోపాటు వీవీప్యాట్‌లపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని కోరారు.

ఏఈఆర్ఓ హేమలత, భార్గవి, భుజేందర్ బాబు, బీఆర్ఎస్ నాయకులు రాజాసురేందర్, జలంధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రవీన్‌కుమార్, బీజేపీ ప్రకాశ్‌గౌడ్, బీఎస్పీ నర్సింగ్‌రావు, కరుణాకర్ పాల్గొన్నారు.

జెక్‌కాలనీలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాలనీ ప్రతినిధులు

అమీర్‌పేట్, మార్చి 6 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటూ వచ్చిన సనత్‌నగర్ జెక్ కాలనీలోని రోడ్ నంబర్-3, 4లో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభించినట్లు కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మల్లు ప్రసాద్, డీఆర్ఎస్ చందు తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి అధికారుల పర్యవేక్షణలో ప్రొక్లెయినర్లతో రోడ్లపై వ్యర్థాలు తొలగించినట్లు పేర్కొన్నారు. కాలనీ ఫెడరేషన్ విజ్ఞప్తుల మేరకు నిధులు మంజూరు చేసిన అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సహకరించిన కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పనులను ఫెడరేషన్ ప్రతినిధులు మురళి, వెంకట్ సోమ, శివారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కంజర్ల శ్రీనివాయాదవ్, సదాశివయాదవ్, బీజేపీ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు తదితరులు పరిశీలించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలను వివరిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

బేగంపేట్ మార్చి 6: పిల్లలకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. ఇనిస్టిట్యూట్ ఏసీపీగా బుధవారం ఆయన బాధ్యతలు తీసుకుని ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలను వివరించారు. రోడ్డు భద్రత, నియమాలను బోధనాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. రహదారులపై క్రమశిక్షణతో వ్యవహరించాలని, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సుమారు యాభై మంది విద్యార్థులతో పాటు టీటీఐ అధికారులు, హీరో మోటార్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలుకు అడ్డుకట్ట వేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 6: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో అధిక ఫీజుల వసూలుకు అడ్డుకట్ట వేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీతేజ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పృథ్వీతేజ మాట్లాడుతూ రాంనగర్‌లోని సన్ ఇంటర్నేషనల్ డిగ్రీ కళాశాలలో ట్యూషన్ ఫీజులకు అదనంగా పెనాల్టీని సైతం విధిస్తున్నారని ఆరోపించారు. ట్యూషన్ ఫీజు కట్టడం ఆలస్యమైనందుకు ఈ పెనాల్టీని పది రోజులకు రూ. పది వేలుగా విధిస్తూ విద్యార్థులను వేదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రణీత్, సతీశ్, మనీశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ అమలు చేయాలి

ఓయూ అధ్యాపకుల ర్యాలీ, ధర్నా

ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 6: సీపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలనా భవనం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ఓయూలో తక్షణమే సీపీఎస్‌ను అమలు చేయాలని, పింఛన్ స్కీమ్ సాధించేందుకు ఉద్యమాలు చేస్తామని తెలిపారు. దీనిపై వర్సిటీ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. అన్ని యూనివర్సిటీలు, ప్రభుత్వ సంస్థల్లో సీపీఎస్ అమలవుతోందని, ఓయూలో మాత్రం ఎల్ఐసీ లింక్‌డ్ పెన్షన్ విధానం అమలవుతోందని చెప్పారు. దీనిని వ్యతిరేకిస్తూ సీపీఎస్ అమలు చేయాలని అనేకసార్లు విన్నవించినా వర్సిటీ అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. అధికారుల అలసత్వం వలన ప్రతీ అధ్యాపకుడు ప్రతి నెలా రూ. వేల పెన్షన్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) కాకపోయినా సీపీఎస్ అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులు పదవీ విరమణ పొందితే కనీసం రూ.40 లక్షలకు పైగా లబ్ధి పొందుతున్నారని, కానీ ఓయూలో మాత్రం కేవలం రూ.10 లక్షలు మాత్రమే పొందుతున్నారని వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సీపీఎస్ అమలు కోసం వర్సిటీ అధికారులు తక్షణమే రూ. 40 కోట్లు కేటాయించాలని, ఉద్యోగులకు మేలు చేసేలా సీపీఎస్‌ను అమలు చేయాలని కోరారు.

నేడు వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభం

కంటోన్మెంట్, మార్చి 6 : కంటోన్మెంట్‌లో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌ను గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. బోర్డు పరిధిలోని మడ్‌ఫోర్డ్ వర్క్‌షాపు సమీపంలో సుమారు రూ.5.90 కోట్లతో హాస్టల్ భవనాన్ని నిర్మించారు. ఇందుకోసం కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ రూ. 2.30 కోట్లు కేటాయించగా, మరో రూ. 3.59 కోట్లను కంటోన్మెంట్ బోర్డు సమకూర్చింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ హాస్టల్‌లో ఒంటరి మహిళలతోపాటు భర్తలకు దూరంగా ఉన్నవారు, వారి పిల్లలు, నిర్భాగ్యులు ఉండేవిధంగా తీర్చిదిద్దారు. ఇందులో మెస్‌తో పాటు ఇండోర్ యాక్టివిటీస్, జిమ్, యోగా, వైద్యం సహా పలు సౌకర్యాలను కల్పించారు. ఇక్కడే నివాసముంటూ ఇతర ప్రాంతాల్లో పనులు చేసే సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

ఆదేవిధంగా ఐదో వార్డులోని మహేంద్రాహిల్స్‌లోని త్రిమూర్తి కాలనీ, ధనలక్ష్మి కాలనీలో సుమారు రూ.3.48 కోట్లతో నిర్మించిన పార్కును కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కంటోన్మెంట్ బోర్డు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్కును మోడల్‌గా తీర్చిదిద్దింది. పార్కులో స్కేటింగ్, చిన్నారులు ఆడుకునేలా మల్టీ ప్లే స్టేషన్స్, ఎయిర్ ఆంపీ థియేటర్, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, ఆక్వాటిక్ ఫౌంటేషన్, టాయ్‌లెట్స్ బ్లాక్, ఫ్లవర్ ప్లాంట్‌లతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ ఆవిర్భావ సభ

టీఎస్పీ ఆవిర్భావ సభలో పాల్గొన్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 6: తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్(టీఎస్పీ) ఆవిర్భావ సభను ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ సభకు తెలంగాణ మలిదశ విద్యార్థి నాయకుడు రాజారాంయాదవ్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ హాజరై టీఎస్పీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ఎన్నో త్యాగాలు చేసినప్పటికీ, తగినంత రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం సామాజిక తెలంగాణే ధ్యేయంగా విద్యార్థి సంఘాలు పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అశోక్‌యాదవ్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ సమాజానికి ద్రోహం జరిగిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధానాలు కొనసాగిస్తే పోరాటం తప్పదని స్పష్టం చేశారు. సామాజిక తెలంగాణే లక్ష్యంగా విద్యార్థులకు మార్గదర్శనం చేస్తామని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు, విద్యార్థి నాయకులు నల్లగొండ అంజి, పాల్వాయి నగేశ్, ఆజాద్, చిరంజీవి, ఎన్ఎం శ్రీకాంత్, వలిగొండ నరసింహ, ఎన్.సైదులు, చందు, శివ, నక్క పద్మ, లత, ఉదయ్‌కుమార్, వడ్డె గణేశ్, వెంపటి సురేశ్, సందీప్, మధు, కిరణ్, మహేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జవాబు పత్రాల నకలు పొందేందుకు..

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 6: ఓయూపరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్-డే), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

బీఈడీ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.

ప్రొఫెసర్ సతీశ్‌కుమార్‌కు ఘనసన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 6: బాసర ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించి, మాతృ విభాగమైన ఉస్మానియా యూనివర్సిటీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి తిరిగి వచ్చిన ప్రొఫెసర్ సతీశ్‌కుమార్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో సమస్యలు ఎక్కువగా ఉన్న సమయంలో డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి, తనదైన శైలిలో వాటిని పరిష్కరించిన ఘనత సతీశ్‌కుమార్‌కు దక్కుతుందన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిష్ట